క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి



యాటకల్లులో 'సిద్ధం' కిట్లను అందజేస్తున్న చంద్రశేఖర్

ఆస్పరి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని యువ నాయకుడు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని యాటకల్లు, తంగరడోణ, తురువగల్లు, నగరూరు, బిణిగేరి, డీకోటకొండ గ్రామాలలో 'మేము సిద్ధం– మా పోలింగ్ బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. బూత్ కన్వీనర్లకు సిద్ధం కిట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాల గురించి గ్రామాలలో ప్రజలకు వివరించి ఓటును అభ్యర్థించాలన్నారు. ఎన్నికలకు సమాయత్తం కావడంపై దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దరెడ్డి, ప్రకాష్, లక్ష్మీనారాయణ, ఆశోక్, శివ, పాండు, లక్ష్మన్న పాల్గొన్నారు.

భర్తను హత్యచేసిన భార్య

ఓబులవారిపల్లె: అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేట పునారావాస కాలనీ -1లో బుధవారం తెల్లవారుజామున బోయ తిమ్మప్ప (40) అనే వ్యక్తిని భార్య నరసమ్మ హత్య చేసింది. పోలీసుల కథనం మేరకు.. కర్నులు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన బోయ తిమ్మప్పకు మంగంపేటకు చెందిన నరసమ్మతో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. పునరావాస కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్య నరసమ్మ మంగంపేటలోని ఏపీఎండీసీలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తుంది. తిమ్మప్ప బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తాగి ఇంటికిరాగా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. నరసమ్మ ఆవేశంతో పక్కనున్న ఇనుప రాడ్డు తీసుకుని తిమ్మప్ప తలపై పలు మార్లు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్‌ఐ చిన్న పెద్దయ్య నరసమ్మను అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వే కొడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనం ఢీకొని దివ్యాంగుడికి తీవ్రగాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని సూదేపల్లెకు చెందిన దివ్యాంగుడు బోడెల్ల సుధాకర్ బుధవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పోలియోతో వికలత్వం కలిగిన సుధాకర్ స్వగ్రామం నుంచి వెల్దుర్తికి తన మూడు చక్రాల బైక్‌లో వచ్చి హైవే-44పై తిరిగి వెళ్తున్నాడు. మంగంపల్లె స్టేజ్ దాటిన తర్వాత మిట్ట వద్ద వెళుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. వాహనంతోపాటు ఎగిరి రోడ్డు పక్కకు పడ్డ సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారకస్థితికి చేరుకున్న క్షతగాత్రుడికి అక్కడున్న వారు సపర్యలు చేశారు. సమాచారమందుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డీడీఓ పదోన్నతులపై హర్షం

వెల్దుర్తి(కృష్ణగిరి): సచివాలయ వ్యవస్థలో పంచాయతీ సెక్రటరీలుగా పనిచేస్తున్న వారికి డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ)లుగా పదోన్నతి కల్పించడంపై హర్షం వ్యక్తమవుతోంది. గోవర్ధనగిరి సచివాలయ సెక్రటరీ జనార్ధన్ పేరేముల పంచాయతీకి, బింగిదొడ్డి పంచాయతీకి సతీష్, బుక్కాపురానికి రవి, శ్రీరంగాపురానికి లోహిత, సూదేపల్లె సచివాలయ సెక్రటరీ రామాంజనేయులు బోగోలు పంచాయతీకి, పుల్లగుమ్మి సెక్రటరీ బోయనపల్లెకు, బొమ్మిరెడ్డిపల్లె సెక్రటరీ సంధ్య అల్లుగుండు పంచాయతీకు, కలుగొట్ల సచివాలయ సెక్రటరీ కృష్ణాపురం పంచాయతీకి, నర్సాపురం సెక్రటరీ సర్పరాజాపురం పంచాయతీకి డీడీఓలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీడీఓ శివశంకరప్పతో కలిసి వెల్దుర్తిలో చేయూత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు



మాట్లాడుతున్న ఆలూరు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ రామునాయక్

ఆలూరు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా బూత్ స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆలూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి రామునాయక్ సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బీఎల్‌ఓలతో సమావేశం అయ్యారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఓటింగ్ శాతం పెరిగేలా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల వివరాలను నివేదిక రూపంలో పంపించాలన్నారు. ఓటర్లు తప్పకుండా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేలా బూత్ లెవల్ అధికారులు చైతన్యపర్చాలన్నారు. మండల, గ్రామ స్థాయిలో ఈవీఎం మిషన్ల పనితీరును వివరిస్తూ, మాక్ పోలింగ్ చేయించి అవగాహన కల్పించాలని సూచించారు. తహసీల్దార్లు చంద్రశేఖర్, ఈరమ్మ, బ్యూలా, పద్మజ, ఈశ్వరయ్య శెట్టి, ఎన్నికల డీటీ గుండాల్‌నాయక్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్, బీఎల్‌ఓలు హాజరయ్యారు.

మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- జగనన్న పాలనలోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం
- వచ్చే ఎన్నికల్లో విజయం మనదే
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సభలో పాల్గొన్న బీవై రామయ్య, బుట్టారేణుక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, చిత్రంలో సమన్వయకర్త బుట్టా రేణుక



హాజరైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు

గోనెగండ్ల: మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. బుధవారం గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ నాయకుడు టి.నాగేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఎస్టీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అతిథులుగా బీవై రామయ్య, ఎమ్మిగనూరు సమన్వయకర్త బుట్టా రేణుక హాజరయ్యారు. ముందుగా పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీవై రామయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించి, దేశంలోనే ఏ నాయకుడు చేయలేని విధంగా సువర్ణపాలన సాగిస్తున్నారని చెప్పారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చని మోసకారి చంద్రబాబు అని విమర్శించారు. అబద్ధాలు, వెన్నుపోటు, మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబునాయుడు అని దుయ్యబట్టారు. ఆయన నిజస్వరూపం తెలుసుకుని ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ అందరినీ గుండెల్లో పెట్టుకొని ఆర్థికంగా, రాజకీయంగా అవకాశాలు కల్పించిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని, వైఎస్సార్‌సీపీ మాత్రమే వెనుకబడిన కులాల వారికి రాజ్యాధికారం కల్పించి, సామాజిక న్యాయం చేసిందని సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ రమణకుమారి, నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, మురళీనాయుడు, బందెనవాజ్, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల వేధింపులతోనే గీతాంజలి ఆత్మహత్య

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందానని ఓ మహిళ చెప్పడం జీర్ణించుకోలేని టీడీపీ, జనసేన పార్టీల సోషల్ మీడియా మూకలు అసభ్య ట్రోలింగ్ చేయడంతోనే గీతాంజలి అనే వివాహిత ఆత్మహత్య చేసుకుందని బుట్టా రేణుక అన్నారు. ఆమె మృతికి సంతాపంగా ప్రతిపక్షాల వైఖరికి నిరసనగా బుధవారం రాత్రి పట్టణంలోని వీవర్స్ కాలనీ వద్ద మహిళలతో కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సున్నిత మనస్తత్వం కలిగిన మహిళల మనోభావాలు దెబ్బతీసేలా ట్రోలింగ్ చేయడం సమంజసం కాదన్నారు. మెప్మా సమాఖ్య సభ్యులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో వైఎస్సార్ చేయూత మెగా చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మహిళల ఆర్థికాభ్యున్నతికే చేయూత

ఎమ్మిగనూరుటౌన్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త బుట్టారేణుక పేర్కొన్నారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చేయూత మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఎమ్మిగనూరులో వైఎస్సార్ చేయూత నాలుగవ విడత కింద 4,789 మంది మహిళలకు రూ.8.97 కోట్లను మంజూరుచేసినట్లు వివరించారు. మొత్తం నాలుగు విడతల్లో రూ.32.96 కోట్లు అందించినట్లు చెప్పారు. మహిళలకు ఆర్థికంగా చేయూతనందించడంతో వారు స్వయంగా వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కుర్ణికరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మ, నాయకులు బుట్టారంగయ్య, బీఆర్ బసిరెడ్డి, బుట్టా నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న మంచినీటి కష్టాలు



మంచినీటి పథకాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

గోనెగండ్ల: మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద మల్టీ విలేజ్ స్కీమ్ కింద రూ.19.50 కోట్లతో చేపట్టే తాగునీటి పథకాలను ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుకతో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మల్టీ వీలేజ్ స్కీమ్ కింద 14 గ్రామాలు.. గోనెగండ్ల మండలంలో గాజులదిన్నె, హెచ్.కైరవాడి, కులుమాల, పెద్దనేలటూర్, చిన్న నేలటూర్, పుట్టపాశం, వేముగోడు, పిల్లిగుండ్ల, నేరుడుప్పల, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు, వీరంపల్లి గ్రామాలు, ఎమ్మిగనూరు మండలంలో రాళ్లదొడ్డి, కడిమెట్ల, ఎర్రకోటకు తాగునీటిని అందించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తారన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి పైప్‌లైన్ ద్వారా ట్యాంకులకు అక్కడి నుండి గ్రామాలకు నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పనులు పూర్తయితే మండలంలో తాగునీటి సమస్య తీరుతుందని సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. నాణ్యతతో చేపట్టాలని కంట్రాక్టర్ రామణారెడ్డికి సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాంబయ్య, ఏఈ శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ టీ.నసురుద్దీన్, మండల కన్వీనర్లు బీఆర్ బసిరెడ్డి, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



జగనన్న కాలనీ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రజల వద్దకే పాలన తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కోటేకల్ పంచాయతీ పరిధిలోని బోడబండ గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పేదల సౌకర్యార్థం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న కాలనీలలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నారన్నారు. ఒకే చోట పెద్దసంఖ్యలో లబ్ధిదారులకు స్థలాలకు కేటాయించి గ్రామాలుగా తయారు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, సర్పంచ్ జాలవాడి లక్ష్మీ, ఎంపీటీసీ సుశీలమ్మ, ఉపసర్పంచ్ అబ్బిలి నాగరాజు, నాయకులు గోవిందురాజులు, లక్ష్మన్న, పెద్దనర్సిరెడ్డి, వడ్డె హనుమంతు, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, హౌసింగ్ ఈఈ రవికుమార్, డీఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకే ప్రజా మద్దతు





కృష్ణగిరిలో వైఎస్సార్ చేయూత మెగా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, చెరుకులపాడులో కమ్యూనిటీ హాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

- రూ.1.44 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రారంభించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- చెరుకులపాడులో కమ్యూనిటీ హాల్ ప్రారంభం

కృష్ణగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అందిస్తున్న సంక్షేమ పాలనకే ప్రజా మద్దతు ఉందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో రూ.1.44 కోట్లతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, జల జీవన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి, ప్రాథమికోన్నత పాఠశాల కాంపౌండ్ వాల్‌ను బుధవారం ఆమె ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ చందనా రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు పత్తికొండలో ఈ ఐదేళ్లలో అభివృద్ధి జరగలేదని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక్కసారి గ్రామాలకు వెళ్లి చూస్తే అభివృద్ధి కనిపిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలే తమను మరోసారి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఏఓ వెంకటేశ్వర్లు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు అబ్దుల్‌వహీద్, హరినాథ్, వైద్యాధికారి ప్రదీప్, పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారితే లక్ష్యం

మహిళా సాధికారితే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, మహిళల పేరిటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె బుధవారం కృష్ణగిరిలో వైఎస్సార్ చేయూత నాల్గవ విడత చెక్కును ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ సుశీలతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు మహిళల రుణాలు మాఫీ చేస్తానని, నిరుపేదలకు ఇళ్లు నిర్మిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తానని ఇలా 600కు పైగా మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ' పేరుతో కొత్త డ్రామా మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలంలో 2,475 మంది మహిళలకు నాల్గవ విడత చేయూత కింద రూ. 4.65 కోట్లు మంజూరుచేసినట్లు వివరించారు. ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఏపీఎం మహేశ్వరయ్య, నాయకులు బ్రహ్మానందరెడ్డి, మాధవరావు, లక్ష్మికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని 3898 మంది మహిళలకు 'వైఎస్సార్ చేయూత' 4వ విడత కింద మంజూరైన రూ.7,19,81,250 మెగా చెక్కును ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ పథకాలతో వ్యాపారాలు ప్రారంభించిన వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

రాజ్యసభ్య సభ్యుడు ఆర్.కృష్ణయ్య నిధులతో చెరుకులపాడు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కృష్ణగిరి ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు ఆమె బీరప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమ్యూనిటీ హాల్‌కు స్థల దాతలు బత్తులోల్లు, డొలొల్లకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ రాజేశ్వరి, సర్పంచ్ రాములమ్మ, ఉప సర్పంచ్ సురేంద్ర, పీఆర్ ఏఈ సురేంద్రనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే సీఎం వైఎస్ జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చారని గుర్తుచేశారు. సీఎం జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రాభివృద్ధి, ప్రజలు ఆర్థికాభివృద్ధిని ఓర్వలేక కుటిల రాజకీయాలతో రాబోవు ఎన్నికలకు ప్రజల వద్దకు వస్తున్నారంటూ ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. చివరకు గుళ్లు, ఆలయాలు అన్నది చూడకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు కంగాటి రామ్మోహన్ రెడ్డి, బొమ్మన రవిరెడ్డి, ఎంపీడీఓ శివశంకరప్ప, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజ, ఏపీఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంచి జరిగింటేనే ఓటెయ్యండి



ఇంగళదహాళ్‌లో బైక్‌ను నడుపుతున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి

హొళగుంద: వైఎస్సార్‌సీపీ పాలనలో మంచి జరిగిఉంటే మరోసారి ఓటు వేసి ఆశీర్వదించాలని ఆ పార్టీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి కోరారు. ఆయన బుధవారం జేసీసీ జిల్లా కో-ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులతో కలిసి హెబ్బటం, ఇంగళదహాళ్, ఎండీ హళ్లి, పెద్దగోనెహాళ్ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ జగనన్న చేసిన మేలును వివరించారు. ఆయన మాట్లాడుతూ.. జగనన్న పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. ఎన్నికలు దగ్గర పడ్తుండడంతో చంద్రబాబు అండ్ కో, పచ్చమీడియా ప్రజలను ఎమార్చడానికి లేనిపోని అసత్యాలను ప్రచారం చేస్తున్నారని అలాంటి వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బైక్ యాత్ర చేస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన సన్యాసి అనే వ్యక్తి ఇంగళదహాళ్‌లో విరూపాక్షిని కలిశాడు. తాను 60 నియోజకవర్గాల్లో 1200 కి.మీ బైక్ యాత్ర చేశానని, ఎక్కడికెళ్లినా జగనన్న చేసిన మేలుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అనంతరం పెద్దగోనెహాళ్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ప్రేమవర్ధన్‌రెడ్డి బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరాడు. ఆయన్ను విరూపాక్షి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డి, మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, కోగిలతోట శేషప్ప, ఎస్కే గిరి, ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే అభివృద్ధి



గోనెగండ్లలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక నాయకులతో కురువపేట, నగిరి గేరిలో రూ.26 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సచివాలయాలనికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేయడంతో ఆయా కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గోనెగండ్లలో రూ.1.60 కోట్లతో మక్కా మసీదు, కటికె వీధి, గద్వాల గేరి, ఎస్సీ, బీసీ కాలనీలలో అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే గ్రామంలో మండల సాధారణ నిధులు రూ.26 లక్షలతో కురువపేట, నగిరి గేరిలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. నాయకులు దొరబాబు, బందెనవాజ్, మన్సూర్, భాస్కర్ రెడ్డి, గోవింద్, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి



పత్తికొండలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పత్తికొండ రూరల్: తెనాలికి చెందిన గీతాంజలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు నాలుగు స్తంభాల కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా పార్లమెంటరీ అధికార ప్రతినిధి శ్రీరంగడు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల తాను పొందిన లబ్ధిని ఓ సభలో వివరించడమే ఆమె చేసిన నేరమన్నట్లుగా టీడీపీ-జనసేన మూకలు ఆమెపై కక్షగట్టాయన్నారు. సోషల్ మీడియాలో ఆ పార్టీశ్రేణుల అసభ్యకర వేధింపులే పేదింటి మహిళను బలితీసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గీతాంజలి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ నారాయణదాస్, వైస్ ఎంపీపీ బలరాముడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, బనగాని అరుణ, సర్పంచులు విజయలక్ష్మి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉపాధి పనులు గుర్తించండి

మద్దికెర: మండలంలో వ్యవసాయ కూలీలు వలస వెళ్లకుండా అవసరమైన ఉపాధి పనులు గుర్తించాలని ఏపీఓ నర్సిరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించడమే గాకుండా అడిగిన వారందరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించడం జరుగుతుందన్నారు. పొలాలలో పనులు చేయించుకోవాలనుకునే రైతులు సంబంధిత ఉపాధి సిబ్బందితో కలిసి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

హొళగుంద: కోగిలతోట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హొళగుంద పీహెచ్‌సీ డాక్టర్లు బిందుమాధవి, న్యూటన్ వైద్యపరీక్షలు నిర్వహించారు. జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నియంత్రణ కార్యక్రమం (ఎన్‌ఐడీడీసీపీ)లో భాగంగా థైరాయిడ్ సమస్య,గొంతు నొప్పి విటమిన్ లోపాలు తదితర వ్యాధులను గుర్తించడానికి 9 మందికి యూరిన్ శాంపుల్స్, 18 మందికి సాల్ట్ శాంపుల్స్‌ను సేకరించినట్లు డాక్టర్లు తెలిపారు.అనారోగ్య లక్షణాలున్న పిల్లలను గుర్తించి తగిన జాగ్రత్తలు పాటించేలా ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. హెల్త్ సిబ్బంది, ఆశావర్కర్లు ఉన్నారు.

15న వాహనాల వేలం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 15వ తేదీన వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలాల్లో పాల్గొనే వారు ఉదయం ఆధార్, పాన్ కార్డులతో వాహనానికి సంబంధించి 10శాతం అమౌంట్ డిపాజిట్ చేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తప్పుడు ప్రచారం తగదు

గోనెగండ్ల: మండలంలోని హెచ్.కై రవాడిలో దళిత సర్పంచ్ సూర్యపోగు సువర్ణమ్మను కింద కూర్చోబెట్టి అవమానించారని సోషల్‌మీడిలో వైరల్ చేయడం అమానుషమని దళిత క్రైస్తవుల పట్ల సమన్వయకర్త బుట్టా రేణుక, ఆ గ్రామ పెద్ద అరుణమ్మ ప్రేమానురాగాలు గలవారని మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు అన్నారు. బుధవారం రాత్రి హెచ్.కైరవాడిలో సమన్వయకర్త బుట్టా రేణుక చర్చిలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుట్టా రేణుక పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పుడు దళితుల అభ్యున్నతికి కృషి, చర్చి నిర్మాణాలకు తోడ్పాటు అందించారన్నారు. అలాగే అరుణమ్మ గ్రామంలో దళితుల కోసం రూ.కోట్లు విలువ చేసే స్థలం విరాళంగా అందించారని చెప్పారు. అలాంటివారు సర్పంచ్‌ను అవమానించారంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

ఆదర్శ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సవిత సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. పూర్తి చేసిన దరఖాస్తు కాపీ, ఆధార్, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, రేషన్‌కార్డు, జిరాక్స్ కాపీలు కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 పరీక్ష ఫీజు ఉంటుందన్నారు.

జలకళతో సాగులోకి బీడుభూములు

ఆలూరు: వైఎస్సార్ జలకళ ద్వారా బోర్లు తవ్వించుకున్న సన్న, చిన్నకారు రైతులకు రైతులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయోజనాలను సమకూర్చిందని ఏపీడీ పద్మావతి అన్నారు. ఆలూరు మండలంలోని ముద్దనగేరి గ్రామంలో వైఎస్సార్ జలకళ ద్వారా తలారి శాంతి ఏర్పాటు చేసుకున్న బోరును ఏపీడీ బుధవారం పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు, రైతులతో సమావేశమయ్యారు. ఏపీడీ మాట్లాడుతూ.. ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ప్రభుత్వం ఉచితంగా బోర్లను తవ్వించడమే గాకుండా మోటార్లు, ఇతర సామగ్రితో పాటు విద్యుత్ కనెక్షన్ అందిస్తోందన్నారు. జలకళ బోర్ల ద్వారా బీడుభూములు సాగులోకి వస్తున్నాయని వివరించారు. క్లస్టర్ పరిధిలో డ్రిప్ ద్వారా తక్కువ నీటితో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటల సాగు చేపట్టాలని రైతులను ప్రోత్సహించారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. అలాగే అన్ని మండలాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని, అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఆదేశించారు. హొళగుంద ఉపాధి సిబ్బంది పనితీరుపై ఏపీడీ అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజల భద్రతకే ఫ్లాగ్ మార్చ్

తుగ్గలి: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి తుగ్గలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎద్దులదొడ్డి, పెండేకల్లు, బొందిమడుగుల, మారెళ్ల, ముక్కెళ్లల్లో బుధవారం కవాతు నిర్వహించారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు, ఎలాంటి అల్లర్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతి భద్రతలు కాపాడేందుకు కవాతు నిర్వహించినట్లు పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలీసుల సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

రెండు పరీక్ష కేంద్రాల ఏర్పాటు

మద్దికెర: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ రంగస్వామి బుధవారం తెలిపారు. మండలంలో 6 ఉన్నత పాఠశాలలున్నాయన్నారు. అందులో 472 మంది విద్యార్థులున్నారని వారిలో వంద మంది పెరవలి గ్రామానికి చెందిన విద్యార్థులు తుగ్గలిలో పరీక్షలు రాయనున్నారని, మిగతా 372 మంది మద్దికెరలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

ఉత్సవాలు ప్రారంభం

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామంలో బుధవారం ఓబులేసు స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామ దేవతలకు, స్వామివారికి అభిషేకం, కలశ, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు గంగపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు, స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.